క్లుప్తంగా

విద్యార్థులకు అభినందన



తాడేపల్లిరూరల్: ఢిల్లీలో గణతంత్రదినోత్సవ పరేడ్‌లో పాల్గొన్న కేఎల్‌యూ ఎన్‌సీసీ విద్యార్థులను వర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ కె.రాజశేఖరరావు, విద్యార్థి సంక్షేమ విభాగా ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాజశేఖరరావు మాట్లాడుతూ ఎన్‌సీసీ 22వ ఆంధ్రా బెటాలియన్‌కు చెందిన ఆర్.మాన్యశ్రీ, 10 ఆంధ్రా బెటాలియన్‌కు చెందిన అప్పికట్ల దీప్తి పాల్గొన్నట్లు తెలిపారు. అప్పికట్ల దీప్తి పరేడ్ అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సమక్షంలో వీణ వాయించి ప్రశంసలు పొందాని తెలిపారు. వర్సిటీ ప్రో వీసీ డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ పావని పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి, తాడేపల్లి ప్రాంతాల్లో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక గుంటూరు కమిటీ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు మాట్లాడుతూ మాఘ మాసంలోని మాఘ పూర్ణిమ, శివరాత్రి పండుగల ప్రత్యేకతను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించామని, సప్త నాడీ కేంద్రాలు గోపురంలోని 7 ద్వారాలుగా ఉన్నవి అని రథ సప్తమి తెలియజేస్తుందని వివరించామన్నారు. కమిటీ సభ్యులు ఆర్.రామకృష్ణ, శివలింగం నాయక్, హరిబాబు, సుబ్బారావు పాల్గొన్నారు.

ఆలపాటి గెలుపునకు ప్రచారం



తాడేపల్లిరూరల్: కృష్ణా, గుంటూరు జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని సోమవారం తాడేపల్లి పట్టణంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు ముమ్మిడి సత్యనారాయణ, యాదవ్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ తాడిబోయిన భాస్కర్, కొర్రపాటి విజయ్, ప్రసాద్ పాల్గొన్నారు.

మంత్రి లోకేష్ కార్మికులకు న్యాయం చేయాలి



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏపీసీ కార్మికులకు మంత్రి నారా లోకేష్ న్యాయం చేయాలని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ విజ్ఞప్తి చేశారు. సోమవారం కార్మికుల నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టప్రకారం తమకు న్యాయంగా రావాల్సిన బకాయిలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. రూ.200 కోట్ల విలువ చేసే ఫ్యాక్టరీ భూముల్లో కార్మికులకు న్యాయంగా రావాల్సిన వాటా వచ్చే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని కోరుతున్నామన్నారు. ఇశ్రాయిల్, సుబ్బారావు, బాష, లక్ష్మి, ఇమాంబి, ప్రసాద్ పాల్గొన్నారు.

పరీక్ష పే చర్చ వీక్షణ



దుగ్గిరాల: పదోతరగతి విద్యార్థుల కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఏర్పాటు చేసిన పరీక్ష పే చర్చ–2025 కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులు వీక్షించారు. ఉదయం 11 గంటలకు వర్చువల్‌గా ప్రారంభమైన కార్యక్రమంలో ప్రధాన నరేంద్ర మోదీ మాట్లాడారు. ఎంఈవో–1 కాజ శ్రీనివాసరావు, ఎంఈవో–2 కాజ లక్ష్మీనారాయణ, ప్రధానోపాధ్యాయని ఎస్.శోభాదేవి పాల్గొన్నారు.

భవితకు కేంద్రం

- చిన్నారులకు చికిత్సతో పాటు విద్యాబోధన
- ఉచిత శిక్షణ, పరికరాలు అందజేత
- మనోధైర్యం నింపుతున్న ఐఈఆర్పీలు



చిన్నారులకు శిక్షణనిస్తున్న ఐఈఆర్‌సీ



వెంకటరెడ్డి పాలెంలోని భవిత కేంద్రం

మంగళగిరి: పుట్టుకతోనే మానసికంగా, శారీరకంగా ఇబ్బంది పడుతున్న చిన్నారుల తల్లితండ్రులకు మేము ఉన్నామంటూ మనోధైర్యాన్ని నింపుతున్నారు భవిత కేంద్రాల్లోని ఐఈఆర్పీలు, ఆయాలు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల కోసం ప్రభుత్వం నగర పరిధిలోని వెంకటరెడ్డి పాలెం(కాజ)లో భవిత కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ కేంద్రంలో ఇద్దరు ఐఈఆర్‌సీలు, ఒక ఆయా పనిచేస్తున్నారు. ఈ ఐఈఆర్‌సీ(ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ రీసోర్స్ పర్సన్స్)లు సర్వేలు నిర్వహించి, ప్రత్యేక అవసరాలు కల పిల్లలను గుర్తిస్తున్నారు. వారికి చక్కటి భవిష్యత్తు అందించేందుకు కృషి చేస్తున్నారు. నగరంలో భవిత కేంద్రంలో 23 మంది చిన్నారులకు శిక్షణ ఇస్తున్నారు. దీని ద్వారా విద్యార్థి దశలోనే మానసిక దివ్యాంగులకు విద్యా బుద్ధులు, ఫిజియో థెరపీ అందిస్తున్నారు. వారికి అవసరమైన పరికరాలు అందజేయడంతో పాటు వారి పనులు వారే స్వచ్ఛందంగా చేసుకునేలా తీర్చిదిద్దుతున్నారు. పిల్లల వయస్సుతో పాటు వారి పరిస్థితిని అంచనా వేసి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి విద్యను అందిస్తున్నారు. వీరికి స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, చిన్నతనంలోనే వికలాంగత్వాన్ని గుర్తించి, తగిన కృత్యాలను, రోజు వారీ కార్యక్రమాలను నేర్పిస్తారు. ఇలా వారంలో ఐదు రోజుల పాటు సేవలందించిన ఐఈఆర్‌సీలు పిల్లలు ఇంటి వద్దకు వెళ్లి తల్లితండ్రుల సమక్షంలో ఫిజియోథెరపితో పాటు శిక్షణ ఇస్తారు. ఈ కేంద్రంలో ప్రతి మంగళవారం ఫిజియోథెరపీ డాక్టర్‌తో చేయిస్తారు.

శిక్షణను తల్లిదండ్రులు కొనసాగించాలి



పిల్లలకు చేస్తున్న సేవ ఒక భాగ్యంగా భావిస్తున్నాను. పిల్లలకు మేము ఇస్తున్న శిక్షణ తల్లితండ్రులు ఇంటి వద్ద కొనసాగించాలి. అప్పుడే వారు త్వరితగతిన మెరుగవుతారు. అందుకు తల్లితండ్రులు తరచూ భవిత పాఠశాలలకు వచ్చి తాము ఇచ్చే సలహాలు సూచనలు స్వీకరించాలి.

– టి.జయలక్ష్మి, ఐఈఆర్‌సీ, భవిత కేంద్రం

పొట్టకొట్టే కుట్ర



బోరుపాలెంలో రేషన్ పంపిణీకి ఉంచిన వాహనం

తాడికొండ: తాడికొండ నియోజకవర్గంలో కూటమి నేతల ఆగడాలకు అంతే లేకుండా పోతోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఫిర్యాదులతో వేధించి, బెదిరించి తొలగించారు. వెనువెంటనే మహిళా వీవోఏ ఉద్యోగాలపై వారి కన్నుపడింది. నియోజకవర్గంలో 30 మందికి పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వర్గాలకు చెందిన పేద మహిళలను ఉద్యోగాల నుంచి తొలగించి, తమవారికి కట్టబెట్టుకున్నారు.

ఇప్పుడు తాజాగా తుళ్లూరు మండలంలో మరో అడుగు ముందుకేశారు. రేషన్ బియ్యం పంపిణీ వాహనాన్ని సొంతం చేసుకునేందుకు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారు. ఎండీయూ వాహనం ఆపరేటర్, దళితుడైన వీర్ల అంకయ్యను తొలగించాలని నానా ఇబ్బందులు పెడుతున్నారు. వీర్ల అంకయ్య ఎండీయూ వాహనం ద్వారా మండలంలోని అబ్బరాజుపాలెం, హరిశ్చంద్రపురం, బోరుపాలెం, దొండపాడు గ్రామాలకు రేషన్ పంపిణీ చేస్తుంటాడు. స్థానిక టీడీపీ నాయకులు డీలర్లను బెదిరించి అతనికి సరుకు ఇవ్వకుండా అడ్డుపడుతున్నారు. ఈ నెల 1న అబ్బరాజుపాలెంలో రేషన్ పంపిణీ చేసిన అతనికి.. 2వ తేదీ హరిశ్చంద్రపురంలో పంపిణీకి సరుకు ఇవ్వొద్దంటూ సదరు డీలర్‌పై ఒత్తిడి తెచ్చారు. దీంతో డీలర్ వీర్ల అంకయ్యను వెనక్కి పంపించేశాడు. బోరుపాలేనికి వెళ్లి మరో డీలర్‌ను సరుకు ఇవ్వాలని అడగగా అక్కడ కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. దీంతో పేదలకు రేషన్ బియ్యం పంపిణీ పూర్తిగా నిలిచిపోయింది. దీంతో వీర్లంకయ్య డీఎస్‌వోకు ఫిర్యాదు చేశారు. డీఎస్ఓ ఆదేశాలతో దొండపాడులో సరుకును లోడింగ్ చేసుకొని శుక్రవారం పంపిణీకి ఆపరేటర్ వెళ్లాడు. వెంటనే స్థానిక టీడీపీ నాయకుడి నుంచి అతనికి బెదిరింపులు మొదలయ్యాయి.

తప్పని ఇబ్బందులు..

నాలుగున్నరేళ్లుగా గ్రామాల్లో సక్రమంగా రేషన్ పంపిణీ చేస్తున్న వ్యక్తిపై ఆరోపణలు చేసి వాహనాన్ని లాక్కోవాలని టీడీపీ నాయకులు యత్నిస్తున్నారు. తమ పార్టీ కార్యకర్తలకు ఉపాధి కల్పించేందుకు మరొకరి పొట్టకొడుతున్నారు. ఈ తంతు అంతా టీడీపీ నియోజకవర్గ ప్రధాన కార్యాలయంలో ఉన్న ఓ వ్యక్తి సహకారంతో జరుగుతుండటంతో అధికారులు కూడా కిమ్మనకుండా సహకరిస్తున్నారు. దీనిపై సీఎస్ డీటీ దేవరాజును వివరణ కోరగా 5వ తేదీ వరకు సమస్య తన దృష్టికి రాలేదని చెబుతున్నారు. తన దృష్టికి వచ్చిన వెంటనే ఫోన్ చేయగా ఆపరేటర్ ఫోన్ స్పందించలేదన్నారు. గ్రామాల్లో తాను విచారణ చేస్తున్నానని, ఆపరేటర్ వ్యవహార శైలిపై ప్రజలు ఆరోపణలు చేస్తున్నారని చెబుతున్నారు.

ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని హుస్సేన్ కట్ట సెంటర్ వద్ద ఉన్న కనకదుర్గ దేవాలయంలో సోమవారం గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి అన్నదాన ట్రస్ట్ కమిటీ ఆహ్వాన పత్రికను సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 26న మహా శివరాత్రి సందర్భంగా శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్ల అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో పండుగ అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 27న దివ్య రథోత్సం జరుగుతుందని, అనంతరం వేలాదిమంది భక్తులకు అన్నదానం నిర్వహించనున్నామన్నారు. రథోత్సవానికి భక్తులు వేలాదిగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ట్రస్ట్ చైర్మన్ వాకా మంగారావు, కోశాధికారి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి దోగిపర్తి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు కోటయ్య, రామకృష్ణారెడ్డి, నాగార్జున, కోటేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పుచ్చకాలయలొచ్చేశాయ్



అమ్మకానికి ఉంచిన పుచ్చకాయలు

మంగళగిరి టౌన్ : వేసవి రాకనే ఎండ తీవ్రత ప్రారంభమైంది. వేసవి తాపం అప్పుడే మొదలైంది. ఇప్పటికే చలి ప్రభావం తగ్గింది. రథ సప్తమి వెళ్లడంతో భానుడు ప్రభావం చూపడం ఆరంభించాడు. శివరాత్రి పండుగ ఇంకా రెండు వారాలపైగా ఉన్నప్పటికీ ఎండలు మండుతున్నాయి. ఉదయం 11 గంటలు దాటితే మంగళగిరి నగరంలో భానుడు భగభగ మంటున్నాడు. సాయంత్రం 4 గంటల వరకు అదే తీవ్రత కనిపిస్తోంది. దీంతో ఉష్ణతాపం నుంచి ఉపశమనం ఇచ్చే ఫలాలు అందుబాటులోకి వచ్చేశాయి. వేసవి ఫలాల్లో ఒకటైన కలింగర (పుచ్చకాయ) విక్రయాలు పట్టణంలో పలుచోట్ల ప్రారంభమయ్యాయి. గౌతమ బుద్ధ రోడ్, పాతబస్టాండ్, కొత్త బస్టాండ్, మార్కెట్, వడ్లపూడి సెంటర్, స్పెన్సర్ తదితర ప్రాంతాల్లో పుచ్చకాయలను ప్రత్యేక డేరాలు వేసి విక్రయిస్తున్నారు. ప్రారంభ సమయం కావడంతో కిలో రూ.30 నుంచి రూ.40ల వరకు విక్రయిస్తున్నారు. మరో నెల గడిస్తే మార్కెట్‌లోకి దిగుబడి విస్తృతంగా వస్తుందని, అప్పుడు కాస్త ధరలు తగ్గే అవకాశం ఉందని విక్రయదారులు పేర్కొంటున్నారు.

12న కంటి, దంత వైద్యశిబిరం

తెనాలి: పట్టణానికి చెందిన రోటరీ క్లబ్ వైకుంఠపురం, ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్, పట్టణ రంగస్థల కళాకారుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 12న ఉచిత కంటి, దంత వైద్యశిబిరం నిర్వహించనున్నారు. కళాకారుల సంఘ సభ్యుల కోసం ఈ వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సోమవారం విలేకరుల సమావేశంలో చెప్పారు. కళాకారుల సంఘంలోని సభ్యులందరూ అవసరమైన కళ్లజోడు, మందులతోపాటు శస్త్రచికిత్సను కూడా ఉచితంగా పొందవచ్చని చెప్పారు. ఆసక్తి గల కళాకారుల సంఘం సభ్యులు వైద్యశిబిరానికి ముందురోజైన 11వ తేదీ ఉదయం 10 గంటల్నుంచి సాయంత్రం 5 గంటల్లోపు బీసీ కాలనీలోని కళాకారుల సంఘంలో పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు. రంగస్థల కళాకారుల సంఘం, అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి, రోటరీ క్లబ్ బాధ్యులు ఈదర వెంకట పూర్ణచంద్, చెరుకుమల్లి సింగారావు, కళాకారుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గరికపాటి సుబ్బారావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంతలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సొలస బస్టాండు సెంటర్, మహాలక్ష్మమ్మ చెట్టు సమీపంలో రోడ్డుపై తీసిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. తాగునీటి పైపు లైను మరామ్మతులకు తీసిన గుంతలు పనులు పూర్తి అయినా పూడ్చకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. నిత్యం అనేక ద్విచక్ర వాహనాలు, వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రిళ్లు ప్రమాదాలు జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైన పంచాయతీ అధికారులు, స్పందించి తీసిన గుంతలు పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన తప్పనిసరి



తాడేపల్లిరూరల్ : ప్రతి ఒక్క వాహనదారుడుకి ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన తప్పని సరి అంటూ కేఎల్‌యూ విద్యార్థులు పోలీసులతో కలసి సోమవారం వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్, కారులో ప్రయాణించేటప్పుడు సీటు బెల్టు ధరించాలని చెప్పారు. రోడ్డు భద్రత పట్ల సరైన అవగాహన లేకపోతే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఎస్ఐ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ తీసుకోండి

కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: పట్టణంలోని వ్యాపారస్తులందరూ ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. 37వ వార్డులో సోమవారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే చిరు వ్యాపారుల వద్దకు వెళ్ళి ట్రేడ్ లైసెన్స్‌లు ఉన్నాయా లేదా అనే దానిపై ఆరా తీశారు. అందరూ తప్పనిసరిగా లైసెన్స్‌లు తీసుకోవాలని, తద్వారా ప్రభుత్వ పథకాలు అందె అవకాశం ఉంటుందని చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

'ఆళ్ల' కవితకు బహుమతి

తెనాలి: గుంటూరుకు చెందిన అమరావతి సాహితీ మిత్రుల 'సాహిత్య సామాజిక సేవాసంస్థ' కవితలపై వర్క్‌షాపు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో జనవరి నెలలో కొత్త సంవత్సరంఅనే అంశంపై కవితాలను ఆహ్వానించారు. తెనాలికి చెందిన కవి, ఆర్టీసీ కండక్టర ఆళ్ల నాగేశ్వరరావు పంపిన 'కొత్త అడుగు' అనే కవితకు ఉత్తమ కవితగా ఎంపికచేశారు. ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రావి రంగారావు ఆ ప్రకారం ధృవీకరణను, ప్రశంసాపత్రాన్ని సోమవారం పంపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

తెనాలిరూరల్: అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పట్టణ సుల్తానాబాద్‌లోని ఓ ఇంట్లో రేషన్ బియ్యం ఉందన్న సమాచారంతో త్రీ టౌన్ పోలీసులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. 29 బియ్యం బస్తాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఇంటి యజమానిపై కేసు నమోదు చేశారు.

పశువుల్లో నైట్రేట్ విష ప్రభావంపై అప్రమత్తం

తెనాలి: పశువుల్లో నైట్రేట్ విషప్రభావం లేకుండా పశుపోషకులు చూసుకోవాలని స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని ఏరియా పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నాగిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కొన్ని ప్రదేశాల్లో నీటిలోనూ, పచ్చిగడ్డి, ఎండుగడ్డి, పాతర గడ్డిలోనూ నైట్రేట్ శాతం 0–500 పీపీఎం ఉన్నట్టుగా పరీక్షల్లో తేలిందన్నారు. నైట్రేట్ శాతం కేవలం 100 పీపీఏ ంలోపు ఉన్నట్టయితే ఆ మేత/నీరు పశువులకు ఎలాంటి హాని చేయదని తెలిపారు. అధిక నేట్రేట్‌తో కూడిన నీరు, మేత తీసుకున్న పశువులు అరగంట నుండి నాలుగు గంటలలోపు విషప్రభావానికి లోనవుతాయని తెలిపారు. నీటి లేదా చాక్లెట్ గోధుమరంగు శ్లేష్మ పొరలు, వేగంగా లేదా కష్టంగా శ్వాస తీసుకోవటం, శ్వాస తీసుకోవటం శబ్దం, నాడి వేగవంతంగా కొట్టుకోవటం, లాలాజలం కారుట, ఉబ్బరం, వణుకు, అస్థిరంగా ఉండటం, తరచుగా మూత్రం పోయటం, పారుడు లక్షణాలు, కడుపునొప్పి, చూడి పశువులు ఈసుకుపోవటం, పాడిపశువుల్లో పాల దిగుబడి తగ్గటంతో పాటు, పశువు బలహీనమై కోమలోకి వెళ్లటం, ఒక్కోసారి మరణించటం కూడా సంభవిస్తుందని వివరించారు. నీటిపై ఏవైనా అనుమానాలుంటే శుభ్రమైన ప్లాస్టిక్ సంచి లేదా సీసాలో ఆ నీటిని సేకరించి, పశువైద్యశాలకు పంపించాలని కోరారు.

వినియోగదారుల ఫోరంపై అవగాహన



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరం కేఎల్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో దుగ్గిరాల మండల పరిధిలోని పెదకొండూరు గ్రామంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టంపై ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వర్సిటీ విద్యార్థి విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ వస్తువు నాణ్యత లేకుంటే..వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేస్తే ధర, కోర్టు ఖర్చులు, మానసిక వేదనకు గురైనందుకు నగదు పొందవచ్చని తెలిపారు. డీన్ డాక్టర్ హబీబుల్లా ఖాన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం గురించి తెలుసుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్ రెడ్డి, సమన్వయకర్త సురేష్, వలంటీర్లను వర్సిటీ ఇన్‌చార్జి వీసీలు డాక్టర్ కె.రాజశేఖరరావు, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, సీఎస్ఈ హానర్స్ విభాగాధిపతి డాక్టర్ టి. పవన్‌కుమార్ అభినందించారు.

సంపూర్ణ ఆరోగ్యానికి అల్బెండజోల్



అల్బెండజోన్ మాత్రలు అందజేస్తున్న వైద్య, నగరపాలక సంస్థ అధికారులు



విద్యార్థులకు మాత్రలు అందజేస్తున్న ఏఎన్ఎం



ట్యాబ్లెట్ వేస్తున్న ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు, హెచ్ఎం శోభాదేవి

మంగళగిరి టౌన్ : విద్యార్థులందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు ఆల్బెండజోన్ మాత్రలు వేసుకోవాలని చైల్డ్ హెల్త్ అండ్ ఇమ్యూనిజైషన్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె.అర్జునరావు, మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ శకుంతల అన్నారు. మంగళగిరి నగర పరిధిలో జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని సోమవారం పలుచోట్ల నిర్వహించారు. వివిధ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అల్బెండజోల్ మాత్రలు విద్యార్థులకు పంపిణీ చేశారు. మంగళగిరి తాడేపల్లి పరిధిలో ఉన్న 9 యూపీహెచ్‌సీలు, 3 పిహెచ్‌సీల పరిధిలో ఉన్న కళాశాలలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సుమారు 53,000 మందికి పైగా మాత్రలు పంపిణీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. పలు యూపీహెచ్‌సీ సెంటర్లలో నులిపురుగుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కలిస్తూ పోస్టర్లు విడుదల చేశారు. యూపీహెచ్‌సీ వైద్యులు అనూష, హర్షవర్ధన్, ఉజ్మా పర్వానా, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అల్బెండజోల్ మాత్రలు పంపిణీ

తాడేపల్లిరూరల్: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా దుగ్గిరాలలోని డాక్టర్ కేఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాలలో దుగ్గిరాల పీహెచ్‌సీ సిబ్బంది సోమవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ స్వాతి నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశామని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ కొత్త గిరిధరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో..

దుగ్గిరాల: జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో సందర్భంగా దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రవేట్ పాఠశాలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లలకు అల్బెండజోల్ మాత్రాలు సోమవారం వేయడం జరిగింది. దుగ్గిరాలలో బాలికోన్నత పాఠశాలలో ఎంపీడీవో శ్రీనివాసరావు పిల్లలకు మాత్రాలు వేశారు. ఎంఈవో కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి సంవత్సరంలో రెండు విడతలుగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిందని చెప్పారు. డాక్టర్ ఇజాజ్ అబ్దుల్ రహమాన్ మాట్లాడుతూ ఈ మాత్రాలు వేసుకోవడం వలన ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం శోభాదేవి, హెల్త్ ఎడ్యుకేటర్ వి.సుబ్బారావు, ఏఎన్ఎం శ్యామాల తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు కృషి

ఫిరంగిపురం: మండంలోని పాఠశాలల్లో విద్యార్థులకు సోమవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా అల్బెండజోల్ మాత్రలు మింగించారు. వేమవరం ఎంపీపీ పాఠశాలలో నుదురుపాడు పీహెచ్‌సీ వైద్యురాలు ఫరీనాబేగం, నుదురుపాడు జెడ్పీ పాఠశాలలో డాక్టర్ యానీగ్రేస్, స్థానిక సెయింట్ ఆన్స్ పాఠశాలలో ఎంఈవో రవికాంత్ మాత్రలు విద్యార్థులకు అందజేశారు. హెచ్ఎం ఇమ్మానియేల్, సీహెచ్‌వో ఎస్‌వీ లక్ష్మీ, ఆరోగ్యపర్యవేక్షకుడు కె.సుదర్శన్‌రాజు, హెచ్ఎంలు సిస్టర్స్ ఒ. థెరిసమ్మ, కె.నిర్మల మేరి, సీహెచ్‌వో వెంకటరమణ, షేక్.అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కోరుతూ మహిళల ధర్నా



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

దుగ్గిరాల: ఇళ్లు లేని పేద, బలహీనవర్గాలకు ప్రభుత్వం నివేశన స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహిళలు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం వెంటనే పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని నినాదాలు చేశారు. సీపీఐ పార్టీ నాయకుడు యార్లగడ్డ శివయ్య ధర్నా నుద్దేశించి మాట్లాడుతూ, మండల గ్రామాల్లో పేద ప్రజలు ఎందరో సొంత ఇల్లు లేకుండా నివసిస్తున్నారని చెప్పారు. కూటమి పార్టీల నాయకులు ఎన్నికల ప్రచారంలో పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇస్తామని హామీనిచ్చారని గుర్తుచేశారు. ఆ ప్రకారం క్యాబినెట్ సమావేశంలోనూ తీర్మానం చేసినట్టు తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్ సుజాతకు వినతి పత్రం అందజేశారు. తుమ్మపూడి గ్రామంలోనూ సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నియోజకవర్గ సీపీఐ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ధర్నా నిర్వహించి, పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు.

పెదరావూరు శివారులో ఆలయానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

పెదరావూరు(తెనాలి): రూరల్ మండల గ్రామం పెదరావూరు శివారులో గల శ్రీమహా విద్యాపీఠం. అభయ హస్త సుబ్రహ్మణ్య క్షేత్రంలో సోమవారం శ్రీలక్ష్మీగణపతి, బాలాంబిక సమేత సర్వహితేశ్వర స్వామి ఆలయన శంకుస్థాపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీకాంచి కామకోటి మూలామ్నాయ సర్వజ్ఞపీఠాధీశ్వరులు జగద్గురు శ్రీశంకరాచార్య శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి దివ్య అనుగ్రహ ఆశీస్సులతో లోక కల్యాణార్థమై దేవాలయ నిర్మాణానికి సంకల్పించిన విషయం తెలిసిందే. ఆ ప్రకారం సుబ్రహ్మణ్య క్షేత్రానికి ఈశాన్య దిశన 30 సెంట్ల విస్తీర్ణంలో ఆలయ నిర్మాణానికి సన్నాహాలు చేశారు. ఈ క్రమంలో ఉదయం 11.12 గంటలకు శంకుస్థాపన చేశారు. అవసరమైన విశేష పూజలు చేశారు. ఆలయంలో ఎలాంటి రుసుం లేకుండా దైవానుగ్రహం కోసం వచ్చిన భక్తులు స్వామివారిని తామే స్వయంగా అభిషేకించుకునే విధంగా ఏర్పాటు చేస్తున్నట్టు సుబ్రహ్మణ్య క్షేత్ర నిర్వాహకుడు చింతపల్లి సుబ్రహ్మణ్యస్వామి వెల్లడించారు. ఆలయానికి వచ్చిన భక్తులు పూజలు అనంతరం ధ్యానం చేసుకునే విధంగా విశాలమైన సముదాయాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.